ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 23-02-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

ముఖ్యాంశాలు

- సాంకేతిక రంగంలో భారతీయ యువత ఆలోచనా విధానం.. మానవాళికి ఎంతగానో మేలు చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభిప్రాయపడ్డారు.

- భారత్ టాక్సీ ప్రపంచంలోనే అత్యంత పారదర్శకమైన క్యాబ్ సర్వీస్‌గా అవతరిస్తుందని కేంద్రమంత్రి అమిత్ షా తెలిపారు.

- కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈరోజు "ప్రహార్" (PRAHAR) పేరుతో భారత కొత్త జాతీయ ఉగ్రవాద వ్యతిరేక విధానం, వ్యూహాన్ని ఆవిష్కరించింది.

- జీరో డిఫెక్ట్.. జీరో ఎఫెక్ట్, అందరికీ సమాన అవకాశాలు దేశ వృద్ధికి కీలక స్తంభాలని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అన్నారు.

= = = = = = = = = = = = = = = = = =

భారతదేశ మొట్టమొదటి భారతీయ గవర్నర్ జనరల్ చక్రవర్తుల రాజగోపాలాచారి జీవితం, వారసత్వాన్ని స్మరించుకుంటూ... న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో `రాజాజీ ఉత్సవం` నిర్వహిస్తున్నారు. రాజగోపాలాచారి విగ్రహాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ రోజు రాష్ట్రపతి భవన్‌లో ఆవిష్కరించారు. అశోక్ మండపం సమీపంలో ఉన్న ఎడ్విన్ లుటియెన్స్ విగ్రహం స్థానంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి మాట్లాడుతూ.. రాజాజీ బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. న్యాయవాద వృత్తి, స్వాతంత్ర్య పోరాటం, సామాజిక, ఆర్థిక సంస్కరణలు, ప్రాచీన భారతీయ గ్రంథాలు, రాజకీయం, పరిపాలన రంగాలకు ఆయన అందించిన సహకారం ఆయా రంగాలను ఎంతగానో సుసంపన్నం చేసిందని తెలిపారు. రాజాజీకి అనేక రంగాల్లో లోతైన అవగాహన ఉందని రాష్ట్రపతి తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

రాజాజీ జీవితం నిజాయితీకి, మేధస్సుకు, దేశం పట్ల అచంచలమైన నిబద్ధతకు నిదర్శనమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు.

= = = = = = = = = = = = = = = = = =

న్యూఢిల్లీలో ఇటీవల ముగిసిన `ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026'ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈరోజు ప్రధాని ఒక సంస్కృత సుభాషితాన్ని పంచుకుంటూ... ఈ చారిత్రాత్మక సమ్మిట్ ద్వారా భారతదేశ సామర్థ్యాలకు ప్రపంచ వ్యాప్తంగా విశేష గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. సాంకేతిక రంగంలో భారతీయ యువతకు ఉన్న దూరదృష్టితో కూడిన ఆలోచనా విధానం.. మానవాళికి ఎంతగానో మేలు చేస్తుందని ప్రధాని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. కాగా.. ఈ సుమ్మిట్ కృత్రిమ మేధ (AI) రంగంలో అంతర్జాతీయ సహకారానికి ఒక కీలక మైలురాయిగా నిలుస్తూ.. `న్యూఢిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్` ఆమోదంతో విజయవంతంగా ముగిసింది.

= = = = = = = = = = = = = = = = = =

భారత్ టాక్సీ సహకార సంస్థ డ్రైవర్లకు యాజమాన్య హక్కును కల్పించి సాధికారులను చేస్తుందని కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. న్యూఢిల్లీలో `భారత్ టాక్సీ` డ్రైవర్లతో కేంద్రమంత్రి ఈ రోజు ముఖాముఖి సంభాషించారు. ప్రైవేట్ టాక్సీ సేవా సంస్థలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడమే కాకుండా, వచ్చే లాభాలు సహకార సంస్థకు కాకుండా నేరుగా డ్రైవర్లే పొందుతారని ఆయన వివరించారు. భారత్ టాక్సీ ప్రపంచంలోనే అత్యంత పారదర్శకమైన క్యాబ్ సర్వీస్‌గా అవతరిస్తుందన్నారు. `సారథి దీదీ` ద్వారా మహిళా ప్రయాణికులు తమ ప్రయాణాల కోసం మహిళా డ్రైవర్లను ఎంచుకోవచ్చని అమిత్ షా వివరిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = =

కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈరోజు `ప్రహార్` (PRAHAR) పేరుతో భారత కొత్త జాతీయ ఉగ్రవాద వ్యతిరేక విధానం, వ్యూహాన్ని ఆవిష్కరించింది. మారుతున్న ఉగ్రవాద ముప్పులను ఎదుర్కోవడానికి, వాటిని నిరోధించడానికి సమగ్రమైన ప్రణాళికతో ఈ వ్యూహం రూపొందించారు. ముప్పుల స్వభావం మారుతూ.. కొత్త సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ, ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లోనూ వ్యతిరేకించడంలో దేశం స్థిరంగా ఉందని మంత్రిత్వ శాఖ తెలిపింది. భారతదేశం ఎల్లప్పుడూ ఉగ్రవాద బాధితులకు అండగా నిలుస్తుందని పేర్కొంది. ఉగ్రవాదంపై భారతదేశం అనుసరిస్తున్న `జీరో టాలరెన్స్` విధానానికి ఇదే ఇదే సూత్రమని హోం మంత్రిత్వ శాఖ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ఓడరేవులు, జలమార్గాల శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ ఈరోజు సుమారు 1,500 కోట్ల రూపాయల విలువైన వివిధ ఓడరేవు ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులలో VOC మారిటైమ్ హెరిటేజ్ మ్యూజియం ప్రారంభోత్సవం, 8 మెగావాట్ల (MW) విండ్ ఫామ్, 5 మెగావాట్ అవర్స్ (MWh) బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ నిర్మాణానికి శంకుస్థాపన వంటివి ఉన్నాయి. వీటితో పాటు ఓడరేవు వద్ద వివిధ కార్పొరేట్ సామాజిక బాధ్యత (CSR) ప్రాజెక్టులను కూడా కేంద్రమంత్రి ప్రారంభించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = =

`జీరో డిఫెక్ట్, జీరో ఎఫెక్ట్` అందరికీ సమాన అవకాశాలు అనేవి.. దేశ వృద్ధికి కీలక స్తంభాలని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన `నేషనల్ క్వాలిటీ కాన్ క్లేవ్-2026' ప్లీనరీ సెషన్‌లో దృశ్య మాధ్యమ విధానంలో ఆయన ప్రసంగించారు. భారతీయ ఉత్పత్తులకు అంతర్జాతీయ ప్రాముఖ్యతను పెంచడానికి పరిశ్రమలు.. మెరుగైన ప్రామాణిక నిర్వహణ ప్రక్రియలు (SOPs), ఉమ్మడి మౌలిక సదుపాయాలను కలిగి ఉండాలని సూచించారు. పలు రంగాలలో కార్మికుల నైపుణ్యాభివృద్ధిపై దృష్టి పెట్టాలని పీయూష్ గోయల్ కోరుతూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కశ్మీర్‌లోని కిష్ట్వార్ జిల్లా చత్రూ ప్రాంతంలో 326 రోజుల పాటు అత్యంత ఎత్తులో చేపట్టిన సంయుక్త ఆపరేషన్‌లో ఏడుగురు ఉగ్రవాదులను హతమార్చినట్లు జమ్మూకు చెందిన భారత ఆర్మీ `వైట్ నైట్ కోర్` (White Knight Corps) సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈరోజు ప్రకటించింది. ఈ ఆపరేషన్‌ను "గ్యాలంట్ పెర్సీవరెన్స్" (Gallant Perseverance)గా పేర్కొంది. కిష్ట్వార్‌లోని కఠినమైన భూభాగాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులలో ఈ సుదీర్ఘమైన ఆపరేషన్‌ను నిర్వహించినట్లు తెలిపింది. సివిల్, మిలిటరీ ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు అందించిన సమాచారం ఆధారంగా భద్రతా దళాలు.. జమ్మూ కాశ్మీర్ పోలీస్, సీఆర్‌పీఎఫ్ (CRPF)లతో సమన్వయం చేసుకుంటూ ఈ దాడులు జరిపాయి.

= = = = = = = = = = = = = = = = = =

మెక్సికోలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న భద్రతా చర్యలు, రహదారుల దిగ్బంధనాలు, నేరపూరిత కార్యకలాపాల నేపథ్యంలో... అక్కడ నివసిస్తున్న భారతీయ పౌరులకు మెక్సికోలోని భారత రాయబార కార్యాలయం ఈరోజు ప్రత్యేక సూచనలు జారీ చేసింది. భారతీయులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, తాము ఉన్న చోటే సురక్షితంగా ఉండాలని కోరింది. భద్రతా దళాలు, పోలీసులు చర్యలు తీసుకుంటున్న జోన్లకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేసింది. అత్యంత అవసరమైతే తప్ప బయటకు రావద్దని, ఏదైనా సహాయం కోసం భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించింది.

= = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 82 వేల 814 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై.. చివరికి 480 పాయింట్ల లాభంతో 83 వేల 294వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 141 పాయింట్లు లాభపడి 25 వేల 713 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 90 రూపాయల 88 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71.38 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5 వేల 147 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = =

ఐసీసీ పురుషుల టీ-20 ప్రపంచ కప్ లో భాగంగా సూపర్- 8లో గ్రూప్-1 విభాగంలో ముంబైలోని వాంఖెడే స్టేడియం వేదికగా జింబాంబ్వే, వెస్టిండీస్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన జింబాంబ్వే బౌలింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్ ప్రారంభించిన వెస్టిండీస్ 16 ఓవర్లకు 3 వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = =

రానున్న రెండు రోజుల పాటు ఒడిశా, అండమాన్ నికోబార్ దీవులలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) అంచనా వేసింది. అదే విధంగా ఈరోజు

ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, విదర్భ, అస్సాం మేఘాలయ రాష్ట్రాల్లో ఉరుములు, మెరుపులు సంభవించవచ్చని పేర్కొంది. మరోవైపు, రాబోయే ఆరు రోజుల్లో వాయువ్య భారతదేశంలో గరిష్ట ఉష్ణోగ్రతలు మూడు నుండి నాలుగు డిగ్రీల సెల్సియస్ వరకు పెరిగే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = =